క్లుప్తంగా

రోజుకు 4,500 మంది కూలీలు లక్ష్యం

తుని రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 4,500 మందికి పని కల్పించడం లక్ష్యంగా డ్వామా పీడీ నిర్దేశించినట్టు ఏపీఓ పసుపులేటి నారాయణరావు తెలిపారు. మంగళవారం ఆయనను కలసిన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో ప్రస్తుతం రోజూ 800 మంది కూలీలు పనులకు వస్తున్నట్టు చెప్పారు. ఈ సంఖ్యను నెలాఖరుకు 4,500కు పెంచాల్సి ఉందన్నారు. వచ్చే సోమవారానికి ఈ సంఖ్యను చేరుకుంటామన్నారు. సంక్రాంతి పండగలు ముగియడం, మెట్ట ప్రాంతంలో రబీ వ్యవసాయ పనులు లేకపోవడంతో సులభంగా లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు.

చిన్నారులకు ఆధార్ నమోదు



వి.కొత్తూరులో చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తుని రూరల్: మండలంలోని ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. 12 గ్రామాలకు చెందిన చిన్నారుల సౌకర్యార్థం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ కె.సాయి నవీన్ తెలిపారు. మంగళవారం వి.కొత్తూరు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. 21న వి.కొత్తూరు, లోవ కొత్తూరు, రాజుపేట, డి.పోలవరం-1, 2 సచివాలయాలు, 22న ఎస్.అన్నవరం-1, దొండవాక, 23న తేటగుంట-1, 2, రాపాక, 24న ఎస్.అన్నవరం-2, రేఖవానిపాలెం సచివాలయాల పరిధిలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరాల నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. పంచాయతీ కార్యదర్శి నాగన్నదొర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఆకెళ్ల



ఆకెళ్ల శాస్త్రి



కర్రి ధర్మరాజు

తుని: పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు ఆకెళ్ల శాస్త్రిని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమించినట్టు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.లక్ష్మీనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ పైడా చలమయ్య కల్యాణ మండపంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆకెళ్ల శాస్త్రి పేరును ప్రకటించారు.

ధర్మరాజు నియామకం

ప్రత్తిపాడు: పెద శంకర్లపూడి గ్రామానికి చెందిన మాజీ సైనికోద్యోగి కర్రి ధర్మరాజు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఉత్తర్వులిచ్చినట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈయన హిందూ రక్షా సమితి రాష్ట్ర కోశాధికారిగా, పార్టీ జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ కమిటీ కన్వీనర్‌గా కొనసాగుతున్నారు.

వీఓఏలకు అవగాహన సదస్సు

గండేపల్లి: మండల సమాఖ్య భవనంలో మంగళవారం వీఓఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్త్రీనిధి, సీఐఎఫ్ రికవరీ, కొత్త రుణాలు, ప్రస్తుతం జరుగుతున్న ఎస్‌హెచ్‌జీ మెంబర్ల ఇన్‌కం సర్వే తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సన్యాసిరావు, వీఓఏలు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన



కార్యక్రమంలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ బుల్లిబాబు

అన్నవరం: రబీ వరి, అపరాల సాగులో తెగుళ్ల నివారణ, సస్యరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ ఏడీ(తుని) సుంకర బుల్లిబాబు రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం తొండంగి మండలం కృష్ణాపురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఏఓ ఎస్ నరసింహ, సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

లెనిన్ స్ఫూర్తితో కార్మిక రాజ్యం

కాకినాడ సిటీ: చరిత్రలో తొలి కార్మిక రాజ్య స్థాపకుడుగా లెనిన్ స్ఫూర్తి కొనసాగుతుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషుబాబ్జీ కొనియాడారు. లెనిన్ శత వర్ధంతి ముగింపు సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం సుందరయ్య భవన్‌లో 'సోషలిస్టు విప్లవం–లెనిన్ కృషి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో శేషుబాబ్జీ ముఖ్యవక్తగా ప్రసంగించారు. మార్క్స్ రూపొందించిన కార్మిక రాజ్య స్థాపన సిద్ధాంతాన్ని రష్యాలో అమలు చేయడంలో లెనిన్ కీలకపాత్ర పోషించారన్నారు.

కాలుష్య తాండవం

- వ్యర్థాలతో కలుషితమవుతున్న నది
- అవుట్‌లెట్ లేక అవస్థలు
- రూ.కోట్లు వెచ్చించినా తప్పని దోమల బెడద
- మెరుగపడని పారిశుధ్యం
- జనవాసాల మధ్యే చెత్త డంపింగ్



తారకరామ నగర్ వద్ద వ్యర్థాలతో నిండి ఉన్న తాండవ నది

తుని: ప్రజలకు మెరుగైన పరిశుభ్రతను కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్న మాటలకు.. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులకు పొంతన ఉండడం లేదు. ఏటా పారిశుధ్య నిర్వహణకు రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా, ఆశించిన స్థాయిలో ఫలితాలు కానరావడం లేదు. పట్టణం నుంచి వెలువడుతున్న వ్యర్థాలు భారీగా కలుస్తుండడంతో తాండవ నది కలుషితమవుతోంది. పట్టణంలో ఎటుచూసినా వ్యర్థాలు పేరుకుపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అధికారంలోకి వస్తే డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తామని నేతలు చెప్పడం, తర్వాత పట్టించుకోకపోవడం సర్వసాధారణంగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో డంపింగ్ యార్డు స్థల సేకరణకు చర్యలు తీసుకున్నారు. ఇందుకు రూ.10 కోట్ల నిధులు అవసరమని ప్రభుత్వానికి నివేదికనూ పంపారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. మున్సిపల్ పాలకవర్గం వైఎస్సార్ సీపీ ఉన్నా.. అంతా అధికార పార్టీ కనుసన్నల్లో పాలన కొనసాగుతోంది. అధికారంలో ఎవరున్నా, ప్రజలకు మాత్రం చెత్త, దోమలతో ఇబ్బందులు తప్పడం లేదు. సంపాదించిన ఆదాయంలో సింహ భాగం రోగాలకు వెచ్చించాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి

తుని పట్టణంలో 30 వార్డుల్లో సుమారు 60 వేల జనాభా ఉన్నారు. ఇతర ప్రాంతాల నుంచి మరో 25 వేల మంది పట్టణానికి వస్తారు. సుమారు 14 వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. రోజుకు 29 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఇక్కడ ఉత్పత్తి అవుతున్నాయి. పారిశుధ్య పనులకు 115 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. చెత్త తరలింపునకు 8 ట్రాక్టర్లు, 47 పుష్‌కార్టులు, 10 డంపర్‌బిన్స్‌ను వాడుతున్నారు. ఏటా పారిశుధ్య విభాగానికి రూ.1.95 కోట్ల బడ్జెట్ కేటాయిస్తున్నారు. పుష్కలంగా నిధులు ఖర్చు చేసినా, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో పాటు మురుగు నీరు పోవడానికి అవుట్‌లెట్ లేకపోవడంతో, ఇదంతా తాండవ నదిలో కలుస్తోంది. స్వచ్ఛమైన నీటిలో మురుగు నీరు కలవడంతో తీవ్ర కాలుష్యం ఏర్పడుతోంది. తుని పట్టణం దిగువన ఉన్న గ్రామాల్లో కలుషిత నీరు తాగిన పశువులు సైతం వ్యాధుల బారిన పడుతున్నాయి.

దోమలకు ఆవాసాలు

పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు, గుంతలు దోమలకు ఆవాసాలుగా ఉన్నాయి. వ్యర్థాలు రోడ్డుకిరువైపులా వేస్తున్నారు. వీటిలో పందులు తిష్టవేసి మరింత కలుషితం చేస్తున్నాయి. కాలువల్లో పూడికలు, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. వీటిలో దోమలు గుడ్లు పెట్టడంతో, దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇసుకలపేట, తారకరామానగర్, కొండవారిపేట, వీరవరపుపేట, ఆర్‌కే కాలనీ, సాయినగర్, మార్కెట్ తదితర ప్రాంతాల్లో ప్రజలు దోమకాటుకు గురవుతున్నారు. దీంతో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా, ఫైలేరియా వంటివి సోకుతున్నాయి.



ఇసుకలపేట ముఠా కాలువలో పేరుకున్న వ్యర్థాలు

జనం జేబులు గుల్ల

సీజనల్ వ్యాధులు సోకిన రోగులు ఆస్పత్రికి వెళితే జేబు ఖాళీ అవుతోంది. రక్త పరీక్ష, మందులు, వైద్యుల ఫీజు ఇలా రూ.వేలల్లో చెల్లించాల్సి వస్తోంది. పేదల సంపాదన ఏటా రోగాలకే ఖర్చయిపోతోంది. పారిశుధ్యం సక్రమంగా నిర్వహించి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దోమల నివారణకు ఏటా రూ.6 లక్షల మేర పారిశుధ్యం విభాగం ఖర్చు చేస్తోంది. ఫాగింగ్, బ్లీచింగ్ తదితర వాటిని క్రమం తప్పకుండా చేయాలి. వీటిని తూతూమంత్రంగా చేయడంతో ప్రజలకు దోమలు రోగాలను బహుమతిగా ఇస్తున్నాయి. దోమ తెరలు, మస్కిటోకాయిల్స్, లిక్విడ్లకు ప్రజలు ప్రతి నెలా రూ.200 ఖర్చు చేయాల్సి వస్తోంది.

సిబ్బంది కొరత

తుని పురపాలక సంఘంలో ఉన్న జనాభా ప్రకారం పారిశుధ్య విభాగానికి 153 సిబ్బంది అవసరం. ప్రస్తుతం 115 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో 8 మందిని కార్యాలయ పనుల కోసం వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం వార్డుకు కనీసం ఐదుగురు ఉండాలి. ప్రస్తుతం ఇద్దరు కార్మికులు స్వీపింగ్, డ్రైనేజీలు శుభ్రం చేయడానికి వినియోగిస్తున్నారు. ట్రాక్టర్లు, రిక్షాల విధులకు 38 మందిని వాడుతున్నారు. జీవో 279 ప్రకారం వర్క్ ఫర్ అవుట్‌సోర్కింగ్ విధానంలో 16 వార్డులను ప్రైవేటుకు ఇవ్వడానికి టెండర్లు పిలిచారు. 14 వార్డులు మున్సిపాలిటీ, 16 వార్డులు ప్రైవేటు సిబ్బంది పారిశుధ్య పనులు చేయనున్నారు.

సంపాదనలో సగం రోగాలకే..



కాలువల్లో చెత్తను తీయడం లేదు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండడంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమల మందు పిచికారీ చేయడం లేదు. దోమల వలన రోగాలు సోకి, సంపాదనలో సగం మందులకు ఖర్చు చేస్తున్నాం.

– మహేష్, వ్యాపారి, తుని

స్థల సేకరణకు చర్యలు



గత ప్రభుత్వ హయాంలో కంపోస్టు యార్డుకు అవసరమైన స్థల సేకరణకు ప్రతిపాదనలు పంపాం. తుని మండలం హంసవరం వద్ద డి-పట్టా భూమి కొనుగోలుకు ప్రభుత్వ అనుమతి కోసం పంపించారు. త్వరలో భూసేకరణ పూర్తి చేస్తాం. పారిశుధ్యం విషయంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మురుగు నీరు శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

– కె.వెంకట్రావు, కమిషనర్, తుని

సంకీర్తన యజ్ఞం ఉత్సవాల ముగింపు



నిర్వాహకులను సత్కరిస్తున్న సమితి సభ్యులు

కిర్లంపూడి: వీరవరంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రారంభించిన సత్యసాయి అఖండ దివ్యనామ సంకీర్తన యజ్ఞం ఉత్సవాలు సోమవారం రాత్రి ఘనంగా ముగిశాయి. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర ఆధ్యాత్మిక సమన్వయకర్త కస్తూరి భాస్కరప్రసాదు మాట్లాడుతూ, పూర్వజన్మల కర్మ ఫలితాలు నశించాలంటే కలియుగంలో దైవ నామస్మరణకు మించిన ఆధ్యాత్మిక సాధన లేదన్నారు. వంద గంటల పాటు సత్యసాయి నామ సంకీర్తన మహాయజ్ఞాన్ని జరిపించిన తోట అప్పలస్వామి, వీరమణి, తోట పాపారాయుడు, రాజ్యలక్ష్మి దంపతులను అభినందించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందురాజు, జిల్లా ఆధ్యాత్మిక విభాగ మహిళా సమన్వయకర్త కె.రాధికతో కలసి వారిని సత్కరించారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

గండేపల్లి: దాళ్వా సాగు చేస్తున్న రైతులు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ సద్గురుమూర్తి తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు, కె.గోపాలపురంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం రబీ 2024-25 పంట నమోదు, ధ్రువీకరణ జరుగుతుందని తెలిపారు. దాళ్వా పంట సాగు చేస్తున్న రైతులు ఈ-పంట నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ చంద్రమౌళి, వీఏఏ ఆలీషా, వీహెచ్‌ఏ సుధ, రైతులు పాల్గొన్నారు.

తెలుగులో భగవద్గీతను అనువదించిన మాజీ సర్పంచ్



అనువాద పుస్తకాన్ని ఈఓకు అందజేస్తున్న గోవిందరావు

అన్నవరం: భగవద్గీతలో సంస్కృత శ్లోకాలకు అచ్చ తెలుగులో గోపాలపట్నం మాజీ సర్పంచ్ అచ్చా గోవిందరావు అనువాదం చేయడంతో సులభంగా చదువుకునే అవకాశం కలిగిందని అన్నవరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు అన్నారు. భగవద్గీత తెలుగు అనువాద పుస్తకాన్ని ఈఓకు గోవిందరావు మంగళవారం అందజేశారు. పలువురు దేవస్థానం అర్చకులు, ఇతర పండితులు పుస్తకాన్ని పరిశీలించి, గోవిందరావు కృషిని అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



కత్తిపూడి పంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

శంఖవరం: పంచాయతీ సిబ్బంది గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని డీఎల్‌పీఓ బాలామణి అన్నారు. మండలంలోని కత్తిపూడి పంచాయతీ కార్యాలయం, చెత్త సేకరణ కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంచాయతీ ద్వారా సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మించాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించాలని, డ్రైన్లలో ఎప్పటికప్పుడు పూడికతీత చేపట్టాలన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. వీధి దీపాలను మెరుగుపర్చాలన్నారు.

విద్యాసంస్థల వాహనాలకు ఫిట్‌నెస్ ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీధర్

- జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీధర్

గండేపల్లి: ప్రైవేటు కాలేజీలు, స్కూళ్ల వాహనాలకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలని కాకినాడ జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కె.శ్రీధర్ స్పష్టం చేశారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎప్పటికప్పుడు వాహనాలకు ఫిట్‌నెస్ తనిఖీ చేయించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. డ్రైవర్లు క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆదేశించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు మాట్లాడుతూ, ప్రమాదాలకు గురయ్యే వారిలో ఎక్కువ శాతం యువతే ఉండడం ఆందోళనకరమన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో సీట్ బెల్టు తప్పక ధరించాలని సూచించారు. పెద్దాపురం, కాకినాడ ఎంవీఐలు కె.ప్రసాద్, హరినాథ్‌రెడ్డి, ఏఎంవీఐ కళాజ్యోతి, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై యూవీ శివనాగబాబు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



డస్ట్‌బిన్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం: మండలంలోని పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. తూర్పులక్ష్మీపురం గ్రామంలో సర్పంచ్ వీరవరెడ్డి సత్యరాణి నాగభార్గవి అధ్యక్షతన పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రతి పౌరుడు కృషి చేయాలన్నారు. అనంతరం తడిచెత్త, పొడిచెత్త డస్ట్‌బిన్లను పంపిణీ చేశారు. ఎంపీడీఓ సూర్యనారాయణ, ఉప సర్పంచ్ భూర్లు అప్పారావు, ఇతర అధికారులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

క్రైస్తవ సేవకులు ఐక్యతగా ఉండాలి



ప్రత్తిపాడులో నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న సభ్యులు

ప్రత్తిపాడు: సమాజంలో క్రైస్తవ సేవకులు ఐక్యతగా ఉండి సమస్యలను సాధించుకోవాలని జిల్లా యునైటెడ్ పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ అన్నారు. ప్రత్తిపాడులో హోప్ ఫౌండేషన్ అధినేత ఇమ్మాన్యుయేల్ మాసా ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం మండల పాస్టర్ల ఫెలోషిప్ కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా శామ్యూల్ సాగర్ హాజరయ్యారు. మండల పాస్టర్ల ఫెలోషిప్ కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా మాసా జాన్, కార్యదర్శిగా పులి సాల్మన్‌రాజు, డిజిటల్ అసిస్టెంట్ సెక్రటరీగా ఏబీసీడీ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా గుండాల సుందర్రావు మాష్టార్లతో పాటు, మరో పది మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో ఊబా కృపావరం, అబ్రహాం శామ్యూల్, జాన్ శామ్యూల్, ప్రభాకరరావు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

యోగాభ్యాసం ద్వారా సుఖశాంతులు



కార్యక్రమంలో పాల్గొన్న ఐవీ రోహిత్, అశోక్‌బాబు, ఏసీ రామ్మోహన్‌రావు తదితరులు

- బ్రహ్మకుమారి ఉషా దీదీ

అన్నవరం: నిత్యం యోగా, జ్ఞానయోగా అభ్యాసం ద్వారా సహజ సిద్ధంగా సుఖశాంతులను పొందవచ్చని బ్రహ్మకుమారి ఉషా దీదీ అన్నారు. మంగళవారం రత్నగిరిపై హరిహర సదన్ సత్రంలో బ్రహ్మకుమారీల సర్వగుణ సంపన్నత యోగ బట్టీని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, తుని మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన్‌రావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మౌంట్ అబూ నుంచి వచ్చిన బ్రహ్మకుమారి ఉషా దీదీ, ముంబై నుంచి వచ్చిన హల్కా దీదీ తదితరులు బ్రహ్మకుమారీల సాధనపై ప్రసంగించారు. బ్రహ్మకుమారీలు రజనీ, అన్నపూర్ణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుమారు వెయ్యి మంది బ్రహ్మకుమారీలు, బ్రహ్మకుమారులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:	
తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540
కిర్లంపూడి:	
తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698

పారదర్శకంగా ఉపాధి హామీ సామాజిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: ఉపాధి పనులపై జరిగే సామాజిక తనిఖీని పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటనారాయణ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులకు మంగళవారం సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ, సామాజిక తనిఖీ ఆలస్యమైనందున తనిఖీ బృందం పనుల పరిశీలనలో ప్రభుత్వ నిబంధనలతో పాటు, మానవతా దృక్పథాన్ని పాటించాలన్నారు. పనుల పరిశీలనలో అందరి వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకుని, సమగ్ర వివరాలు నమోదు చేయాలన్నారు. ఎస్ఆర్పీ సింహాద్రి మాట్లాడుతూ, 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి పారుదల శాఖ ద్వారా జరిగిన రూ.12.40 కోట్ల పనులపై సుమారుగా 15 రోజుల పాటు సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు. పనుల పరిశీలన అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, అభ్యర్థనలు స్వీకరిస్తామన్నారు. ఫిబ్రవరి 7న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓలు రాజగోపాల్, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



జగపతినగరంలో నిర్వహించిన పశువైద్య శిబిరం



రాజపూడిలో పశువైద్య శిబిరం

కిర్లంపూడి: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అన్నారు. జగపతినగరంలోని మార్కెట్ యార్డులో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వెన్నా వినోద్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ వినోద్ మాట్లాడుతూ, పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. గొర్రెలు, మేకలు, పశువులకు నట్టల వ్యాధి నివారణకు 20 మంది పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

జగ్గంపేట: మండలంలో ఈ నెల 31 వరకు నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశు వైద్యశాల అధికారి కె.తాతయ్య తెలిపారు. పలు గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలలో పశువులకు నట్టల నివారణ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసినట్లు చెప్పారు. వ్యాధి నిరోధక టీకాల వల్ల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు.

గండేపల్లి: పశు పరిరక్షణ, ఉత్పత్తిని పెంచాలని పశు వైద్యాధికారి పి.శ్రీనివాస్ రైతులకు సూచించారు. మండలంలోని మురారిలో మంగళవారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. పశువుల వ్యాధుల నివారణకు పలు సూచనలు అందజేశారు. ముందుగా నట్టల నివారణ, గర్భకోశ వ్యాధులకు సంబంధించి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, లేగదూడలకు చికిత్స అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాస్తి వసంత్, మాజీ సర్పంచ్ ఉండవిల్లి బుల్లిరాజు, పశు పోషకులు, రైతులు పాల్గొన్నారు.

ఓంకార స్వామి బోధనలు అనుసరణీయం



ప్రణవ పతాకావిష్కరణ చేస్తున్న పద్మనాభానంద సరస్వతీ స్వామీజీ

ప్రత్తిపాడు రూరల్: ప్రతి ఒక్కరికీ ఓంకార స్వామి బోధనలు అనుసరణీయమని హిమాలయాల్లోని రుషికేష్ పీఠాధిపతి పద్మనాభానంద సరస్వతీ స్వామీజీ అన్నారు. ప్రత్తిపాడు మండలంలోని శాంతి ఆశ్రమంలో 131వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆశ్రమంలో ప్రణవ పతాకాన్ని పద్మనాభానంద ఆవిష్కరించగా, ఓంకార మందిరంలో ఆశ్రమ పీఠాధిపతి మాతా జ్ఞానేశ్వరిదేవి జ్యోతి ప్రజ్వలన చేసి, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఆధ్యాత్మిక సభలో పద్మనాభానంద సరస్వతి మాట్లాడుతూ, ప్రపంచ శాంతి కోసమే ఓంకార స్వామి శాంతి ఆశ్రమాన్ని నెలకొల్పారన్నారు. మత సామరస్యానికి శాంతి ఆశ్రమం ప్రతీకగా ఉండేలా ఏర్పాట్లు చేశారని వివరించారు. కార్యక్రమంలో ప్రణవానంద మాతాజీ తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు మండల అధికారులు

కోటనందూరు:		
తహసీల్దార్	టి.సుభాష్	8008803205
ఎంపీడీఓ	వెంకటనారాయణ	98496 63415
మండల వైద్యాధికారి	యామిని కావ్య	76750 32399
వ్యవసాయాధికారి	కేజీ చంద్రశేఖర్	83310 56617
ఎంఈఓ-1	ఏపీఎస్ శ్రీనివాస్	89856 02864
ఎంఈఓ-2	రామశేఖర్	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	ఎం.రత్నతేజ	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	ప్రదీప్‌కుమార్	94919 34613
ఎస్సై	టి.రామకృష్ణ	94409 00773
వెలుగు ఏపీఎం	పి.సూర్యకుమారి	80088 04895
ఉపాధిహామీ ఏపీఓ	రాజగోపాల్	70939 98217
ఏఎస్ఓ	ఎస్.వామనమూర్తి	989796696